నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 22 జూలై 2024 | KARIMNAGAR

## అన్ని అర్హతలున్నా కాలే..



నేను కమాన్‌పూర్ కేడీసీసీ బ్యాంకులో ఎకురం 27 గంటల భూమిపై 2021 సెప్టెంబర్‌లో రూ.59 వేలు క్రాప్ లోన్ తీసుకున్న. కానీ, రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు.. నాకు తెల్ల రేషన్ కార్డు ఉంది. ఐటీ లేదు. సర్కారు నౌకరీ అంతకన్నా లేదు. ఎవుసం చేసుకుంటున్న.. మరి నాకెందుకు మాఫీ కాలే? రూ.లక్ష లోపు ఉన్నవారికి రుణమాఫీ చేశామని సీఎం, మంత్రులు గొప్పగ చెబుతున్నరు. కానీ, నాకు రూ.59 వేలే మాఫీ కాలే. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నాకు అన్ని అర్హతలు ఉన్నయ్ కదా?. బ్యాంకు, వ్యవసాయ అధికారులను అడిగితే స్పష్టంగా చెప్తలేరు. పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఏర్పాటు టోల్ ఫ్రీ నెంబర్‌కు రెండు రోజల కిందనే ఫోన్ కూడా చేసిన. పేరు, సెల్ నంబర్, అధార్ నెంబర్ అడిగిండ్రు. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి మెస్సేజ్ రాలే. ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. మాఫీ చేస్తరా? చేయరా? చెప్పండి. కాలయాపన చేస్తూ రైతులను అయోమయానికి గురి చేయద్దు.

**- కొయ్యడ మారుతి, రైతు, రొంపికుంట, కమాన్‌పూర్ మండలం(పెద్దపల్లి)**


## నాకెందుకు కాలేదో తెలుస్తలేదు..



నాకు ఓడేడ్ శివారులో ఎకరం భూమి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.40 వేల క్రాప్ లోన్ తెచ్చుకున్న. లక్ష లోపు రుణాలు అన్నీ మాఫీ అవుతయ్ అన్నరు. నా అప్పు కూడా పోతుందనుకుని సంబురపడ్డ. కానీ, వాళ్లు ఇచ్చిన లిస్టుల నా పేరు లేదు. నా కన్నా ఎక్కువ ఉన్నోళ్లకు మాఫీ వచ్చింది. నాకెందుకు రాలేదో తెలుస్తలేదు. ఇట్లైతే ఎట్ల?. నాకు మాఫీ అయ్యేటట్టు చూడాలె.

**- మచ్చ దేవేంద్ర, మహిళా రైతు (ముత్తారం )**

# మేమేం పాపం చేశాం..



- మాకేదీ రుణ మాఫీ?
- 'రైతుబంధు'కు అర్హులమైన మేం దీనికి కాదా?
- ఏక కాలంలో చేస్తామని ఎందుకీ కొర్రీలు
- సర్కారు తీరుపై మండిపడుతున్న రైతులు
- రూ.లక్ష లోపు రుణం ఉన్నా మాఫీకి నోచుకోక అయోమయం
- రాని వారు పేర్లు రాయించుకోవాలంటున్న అధికారులు

''రైతుబంధు పథకానికి అర్హులమైన మేము రైతు రుణమాఫీకి అర్హులం కాదా?. తీసుకున్నది రూ.లక్ష లోపే అయినా సర్కారు ప్రకటించిన మొదటి లిస్ట్‌లో మా పేరెందుకు లేదు?. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కొర్రీలు ఎందుకు పెడుతున్నరు?'' అంటూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అర్హత ఉన్నా రుణమాఫీకి నోచుకోని రైతులు సర్కారు తీరుపై మండిపడుతున్నారు. తీసుకున్న క్రాప్ లోన్ రూ.లక్ష లోపే అయినా వందలాది మంది పేర్లు మాఫీ జాబితాలో లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమకు రుణ మాఫీ వర్తిస్తుందా? లేదా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇప్పటికే అనేక కొర్రీలు పెట్టి జాబితాను వడబోస్తున్న ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి కూడా ఇవ్వడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

-కరీంనగర్, జూలై 21 (నమస్తే తెలంగాణ)

రైతు రుణమాఫీ పథకం కింద మొదట రూ.లక్ష వరకు ఉన్నవి మాఫీ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో కొందరి పేర్లు మాత్రమే ఉండడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. ఒక్కో గ్రామంలో వందల మంది రైతులు ఉంటే పదుల సంఖ్యలో మాత్రమే రుణ మాఫీ వర్తించడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో కనిపిస్తున్నారు. రైతుబంధు పథకానికి అర్హులమైన తాము రుణమాఫీకి ఎందుకు అర్హులం కాదని, తామేం పాపం చేశామని నిలదీస్తున్నారు. అంతే కాకుండా, ఏక కాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మూడు విడతల్లో ఇస్తామని మాట మార్చడాన్ని తప్పుబడుతున్నారు. రూ.లక్ష వరకు ఉన్న రైతులకు ఒకసారి, రూ.1.50 లక్షల వరకు ఉన్న రైతులకు రెండోసారి, రూ.2 లక్షల వరకు ఉన్న రైతులకు చివరి సారిగా రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పడాన్ని రైతులు తప్పుబడుతున్నారు. అర్హత ఉండి రుణ మాఫీ జాబితాలోకి రాని రైతులకు మరోసారి అవకాశం ఇస్తున్నామని, రైతు వేదికల్లో ఏఈవోల వద్ద బుక్‌లో తమ పేర్లు రాయించుకోవాలని జిల్లా అధికారులు చెబుతున్నారు. అయితే, తమ వివరాలన్నీ బ్యాంకులో ఉన్నాయని మళ్లీ పేర్లు రాయించుకోవడం దేనికని, ఈ రకంగా మరోసారి కాలయాపన చేసేందుకే ఈ విధంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

### గొల్లపల్లిలో సగం మందికి ఎగనామం

గొల్లపల్లి, జూలై 20: గొల్లపల్లి సహకార సంఘం పరిధిలో రూ.లక్షలోపు రుణం తీసుకున్నవారు 687 మంది ఉండగా, అందులో 349 మందికి మాత్రమే మాఫీ వర్తించింది. చెందోలి సంఘం పరిధిలో 426 మందికిగాను 196 మంది రైతులకు మాత్రమే మాఫీ జరిగింది. మొత్తంగా 1,113 మందిలో 568 మందికి ప్రభుత్వం ఎగనామం పెట్టిందని రైతులు వాపోయారు.

### ఆరు సంఘాల్లో సగంలోపే..

కోరుట్ల/ కోరుట్ల రూరల్, జూలై 20: కోరుట్ల మండలంలోని ఆరు సంఘాల పరిధిలో సగంమందికి రుణమాఫీ అంద లేదు. కోరుట్ల ప్రాథమిక సహకార సంఘంలో రూ.లక్షలోపు లోన్లు తీసుకున్నవారు 671 మంది ఉండగా, 250 మందికి మాత్రమే మాఫీ జరిగింది. ఎఖీన్‌పూర్‌లో 681 మందికిగాను 183 మందికి, మాదాపూర్ సంఘంలో 626 మందికిగాను 137 మందికి, పైడిమడుగులో 849 మందికిగాను 136మందికి, చిన్నమెట్‌పల్లిలో 640 మందికిగాను 269 మందికి, అయిలాపూర్ సంఘంలో 429 మందికిగాను కేవలం 103 మందికి మాత్రమే మాఫీ జరిగింది. మొత్తంగా 3896 మంది లోన్ తీసుకుంటే 1078 మందికే రద్దు కాగా, మిగిలిన 2818 మంది ఆందోళన చెందుతున్నారు.



కోరుట్లలోని ప్రాథమిక సహకార సంఘం భవనం

### ఏటా రెన్యువల్ చేస్తున్నా మాఫీ కాలే..



నాకు ఒక ఎకరం 10 గుంటల వ్యవసాయ భూమి ఉంది. మంథని ఎస్బీఐ(ఏడీబీ) బ్యాంకులో 2019లో క్రాప్‌లోన్ తీసుకున్నా. ఏటా వడ్డీ చెల్లిస్తూ రెన్యువల్ చేయించుకుంటున్న. నాకు ప్రతి ఏడాది రైతు బంధు, పీఎం కిసాన్ డబ్బులు వస్తున్నయ్. ప్రస్తుత సర్కారు రుణమాఫీ కోసం విధించిన అన్ని నిబంధనలు లోబడి ఉన్నా నా లోన్ మాత్రం మాఫీ కాలే. బ్యాంకు అధికారులను అడిగినా ఎలాంటి స్పందన లేదు.

**- ఆకుల సాయి, రైతు, కాకర్లపల్లి, మంథని మండలం(మంథని రూరల్ )**

### అర్హత ఉన్నా లిస్ట్‌ల పేరు రాలే..



నేను చిన్న సన్నకారు రైతును. నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. జూలపల్లి బ్యాంక్‌ల రూ.80 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. కాంగ్రెస్ సర్కార్ ప్రతి రైతు కుటుంబానికి రూ.రెండు లక్షల రుణ మాఫీ చేసినట్లు ప్రకటించింది. గురువారం రూ.లక్ష వరకు మాఫీ చేస్తమని చెప్పింది. కానీ, సర్కారు ఇచ్చిన మొదటి జాబితాల నా పేరు లేదు. ఎందుకు రాలేదో అని అడిగితే ఎవరూ తెల్వదంటున్నరు.

**- అమరగాని లింగయ్యగౌడ్, రైతు, పెద్దాపూర్ (జూలపల్లి)**

### ఎందుకు కాలేదో అర్థమైతలేదు..



దుర్శేడ్ ఇండియన్ బ్యాంకుల నేను రూ.68 వేల క్రాప్ లోన్ తీసుకున్న. ఏటా వడ్డీ కట్టుకుంట వస్తున్న. అయినా నాకు రుణమాఫీ కాలే. ఏమైందని బ్యాంకు అధికారులను అడిగితే ఇంకా నాలుగైదు రోజుల వరకు పూర్తిగా తెల్వదన్నరు. అప్పటివరకు ఏం చెప్పలేమంటున్నరు. మరి మాకు ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు.

**- గాండ్ల శంకరయ్య, తండ్రి మల్లయ్య, చేగుర్తి (కరీంనగర్ రూరల్ )**

### మాఫీ కాలే.. మేస్సేజ్ రాలే..



బొమ్మకల్‌లోని వ్యవసాయ భూమిపై రెండేండ్ల క్రితం దుర్శేడ్ ఇండియన్ బ్యాంకులో రూ. 60 వేల లోన్ తీసుకున్న. ప్రభుత్వం రెండు రోజుల క్రితం రూ. లక్ష దాకా పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పగానే మస్తు ఖుషీ అయిన. మొన్న చీకటిపడినంక ఫోన్ జూసుకుంటే మెస్సేజ్ రాలే. నిన్న ఎంతో ఆత్రుతతో బ్యాంకుకు వెళ్లి తెలుసుకుంటే నీ రుణం మాఫీ కాలేదని చెప్పిన్రు. అగో గిట్లేట్ల ఉండదని సార్లను అడిగితే మాకేం తెలియదు అధికారుల దగ్గరికి వెళ్లమని చెప్పిన్రు. ప్రభుత్వం గిట్ల జేత్తదని అనుకోలేదు.

**- మంద నారాయణ, గోపాల్‌పూర్, (కరీంనగర్ రూరల్ )**

# కలెక్టరేట్‌లో కంపు..కంపు..



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు

**అపరిశుభ్రంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు**

జగిత్యాల, జూలై 21 (నమస్తే తెలంగాణ): లోన పురుగు.. పైన మెరుగు అనే నానుడి జగిత్యాల కలెక్టరేట్‌కు అచ్చంగా సరిపోతుంది.. సువిశాల స్థలంలో అధునాతన హంగులతో ఠీవిగా దర్శనమిచ్చే ఈ భవన సముదాయం, దగ్గరికి వెళ్లి చూస్తే నిర్వహణ లోపం బట్ట బయలవుతుంది. వెనుకవైపు గల గదులు, హాళ్లు, కారిడార్లు దుమ్ముతో నిండిపోయాయి. ఇక విజిటర్స్ కోసం కారిడార్లలో ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రతతో కంపుకొడుతున్నాయి. ఇక పై అంతస్తులో నైతే మరింత అధ్వాన్నంగా కనిపిస్తూ దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. వానకాలంలో పరిశుభ్రత పాటించాలని. డ్రైనేజీలను శుద్ధి చేయాలని, దోమలు, కీటకాలను నిర్మూలించాలని ప్రజలకు చెప్పే అధికారులు ఉన్నచోటే ఇలాంటి అపరిశుభ్రకరమైన వాతావరణం ఉండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీలు

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 21 : సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో పలు కేడర్లకు చెందిన ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న వారికి శనివారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు మెయిల్ ద్వారా ఉత్తర్వులు అందినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగిన ఈ బదిలీల్లో 43 మంది జూనియర్ అసిస్టెంట్లు, 11 మంది అటెండర్లు, ముగ్గురు షరాబులకు స్థాన చలనం కలుగగా, వీరంతా సోమవారం వరకు బదిలీ అయిన చోట విధుల్లో చేరాలని ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. అలాగే, ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు సబ్ రిజిస్ట్రార్లు కూడా నేడో, రేపో బదిలీ ఉత్తర్వులు అందుకోనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

### సంక్షేమ శాఖలో సీడీపీవోలు..

జిల్లా సంక్షేమ శాఖలో మూడు ప్రాజెక్టుల పరిధిలోని పలువురు సీడీపీవోలు, ఏ సీడీపీవోలు బదిలీ అయ్యారు. కరీంనగర్ రూరల్ ప్రాజెక్టులో సీడీపీవోలుగా కొనసాగుతున్న సబిత సిరిసిల్లకు, సరస్వతి ఏ సీడీపీఓగా మల్యాలకు, హుజూరాబాద్ సీడీపీవో శారద సిద్దిపేటకు, ఏసీడీపీవో భాగ్యలక్ష్మి పరకాలకు, గంగాధర ఏ సీడీపీవో సౌందర్య వేములవాడకు బదిలీ అయ్యారు. భూగర్భ జల వనరుల శాఖలో డిప్యూటీ డైరెక్టర్ శైలజ మల్లికాంబతో పాటు ఇద్దరు జియాలజిస్టులకు స్థాన చలనం కలిగింది. రహదారులు భవనాల శాఖలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఎనిమిది మంది అటెండర్లు, రెవెన్యూ శాఖలో 9 మంది అటెండర్లు, ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లకు బదిలీ ఉత్తర్వులు అందినట్లు ఆయా శాఖల అధికారులు వెల్లడించారు.




# వదలని వాన



మంథని, బోయినిపేటలో కూలిన ఇల్లు

- కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- అలుగుపారుతున్న చెరువులు, కుంటలు
- పొంగుతున్న చిలుక, కేశవపట్నం వాగులు
- ఎల్ఎండీ, ఎస్సారార్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో
- గోదావరి ఉధృతి.. ధర్మపురి వద్ద భారీగా వరద
- అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- గంగాధర, హుజూరాబాద్ మండలాల్లో అత్యధికంగా 78.6 మిల్లీమీటర్ల వర్షపాతం



కరీంనగర్: జ్యోతినగర్‌లో కురుస్తున్న వాన



పెద్దపల్లి రూరల్: సబ్బితం వద్ద జలపాతం సందర్శన నిషేద ఫ్లెక్సీ పెడుతున్న ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ కృష్ణ, పెద్దపల్లి, బసంత్‌నగర్ ఎస్‌ఐలు



కరీంనగర్: చైతన్యపురి ప్రాంతంలో కార్లపై విరిగిన పడిన చెట్టు

కరీంనగర్, జూలై 21 (నమస్తే తెలంగాణ): అల్పపీడన ప్రభావంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శనివారం సాయంత్రం నుంచి తెరిపి లేకుండా పడుతుండగా వాగులు, వంకలు పొంగుతున్నాయి. కుంటలు, చెరువుల్లోకి వరద నీరు చేరుతుండగా, మత్తళ్లు పడుతున్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని చిలుక వాగు శనివారం రాత్రి నుంచే పొంగి పొర్లుతోంది. వాగు పరిసరాల్లోని కొన్ని గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నంలోని వాగులో వరద ఉధృతంగా వస్తోంది. జగిత్యాల జిల్లాలో వర్షం దంచి కొట్టింది. కొడిమ్యాల మండలం పోతారం రిజర్వాయర్, కోనాపూర్‌లోని బంజరు చెరువు మత్తళ్లు దూకుతున్నాయి. కొడిమ్యాల నుండి సూరంపేట వెళ్లే దారిలో కోనాపూర్ శివారులో మాటుకుంట కట్ట కోతకు గురి కావడంతో కోరుట్ల నుంచి కరీంనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సును అధికారులు నిలిపివేశారు. వేములవాడ మూలవాగు జలకళ సంతరించుకుంది. పట్టణంలో బతుకమ్మ తెప్ప వద్ద చెక్ డ్యామ్ మత్తడి దూకగా తిప్పాపూర్‌కు వెళ్లేందుకు మూలవాగులో వేసిన రహదారి కొట్టుకుపోయింది.

### కూలిన ఇండ్లు..

కోనరావుపేట మండలం మామిడిపల్లిలో పాముగారి రమేశ్‌కు చెందిన పెంకుటిల్లు తడిసిపోయి కూలిపోయింది. మల్లాపూర్ మండల కేంద్రంలో దామెర నరేశ్ ఇల్లు కూలిపోయింది. మంథని మున్సిపాలిటీ పరిధిలోని బోయినిపేట(తెనుగుగూడెం)లో ఉండే వారి నివాసంలో కుం ట సమ్మక్క, సందీప అనే అక్కాచెల్లెళ్ల ఇల్లు కూలిపోయింది.

### గోదారి ఉధృతి.. ప్రాజెక్టులకు వరద

ధర్మపురి వద్ద గోదావరి నది ఉధృతి పెరిగింది. గోదావరి ద్వారా 27,981క్యూసెక్కులు, కడెం ప్రాజెక్ట్ నుంచి 14,333 క్యూసెక్కుల వరద ఎల్లంపల్లి బరాజ్‌లోకి వస్తున్నది. ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.87 టీఎంసీల నీరు ఉంది. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని మోయతుమ్మెద వాగు ద్వారా ఎల్ఎండీ రిజర్వాయర్‌లోకి 771 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. సిరిసిల్ల జిల్లా వేములవాడ మూలవాగు ఉప్పొంగుతున్నది. ఎస్సారార్ జలాశయానికి 1870 క్యూసెక్కుల వరద వస్తున్నది. జలాశయంలో 27.54 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను ప్రస్తుతం 5.663 నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### కరీంనగర్‌లో అత్యధికం

కరీంనగర్ జిల్లాలో ఆదివారం ఉదయం వరకు సగటున 52.5 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. అత్యధికంగా గంగాధరలో 78.6 కురిసింది. పెద్దపల్లి జిల్లాలో సగటున 42.9మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. అత్యధికంగా ధర్మారంలో మండలంలో అత్యధికంగా 67.7 కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 9.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చందుర్తి మండలంలో 14.6మిల్లీమీటర్లు నమోదైంది. జగిత్యాల జిల్లాలో 70.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లో 111.0 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డైంది.



వేములవాడ: అర్బన్ కాలనీ కట్టు కాలువ వద్ద చేపలు పడుతున్న చిన్నారులు

# బదిలీల కోసం కమిటీలు

- ఇప్పటికే ఆప్షన్ల స్వీకరణ
- సీనియార్టీ, ఆరోపణలు తదితర వివరాల సేకరణ
- ప్రామాణికతపై ఆలయ ఉద్యోగుల్లో ఆందోళన



వేములవాడ, జూలై 21: రాష్ట్ర దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల కోసం ఉన్నతాధికారులు కమిటీలు ఏర్పాటు చేశారు. ఇందులో ఆర్‌జేసీ, డీసీ, ఏసీ క్యాడర్‌తోపాటు ఆలయాల స్థాయికి అనుగుణంగా ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే ఆప్షన్లను స్వీకరించగా ఈనెల 27వ తేదీలోగా పరిశీలిస్తారు. అనంతరం 28, 29 తేదీల్లో ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇప్పటికే ఉద్యోగుల సీనియార్టీ, విధి నిర్వహణలో చేసిన తప్పులు, ఆరోపణలు తదితర వివరాలు సేకరించారు. అయితే దేనిని ప్రామాణికంగా తీసుకుంటారోనని ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొన్నది.

### ఆర్‌జేసీ టెంపుల్స్‌కు కమిషనర్ స్థాయిలో..

ఆర్‌జేసీ పరిధిలో ఉన్న రాష్ట్రంలోని వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం ఆలయాల ఉద్యోగుల బదిలీకి దేవాదాయ శాఖ కమిషనర్ నేతృత్వంలో అదనపు కమిషనర్, ఆర్‌జేసీ, సంబంధిత ఆలయాల కార్య నిర్వహణాధికారుల సీఈవోలతో కమిటీ వేశారు. అయితే, తుది జాబితాను కమిషనరే రూపొందిస్తారు. మిగిలిన డీసీ స్థాయి కొండగట్టు, కొమురవెల్లి, బాసర టెంపుల్స్‌కు మాత్రం దేవాదాయ శాఖ కమిషనర్, అదనపు కమిషనర్, ఆర్‌జేసీ, సంబంధిత ఆలయాల సీఈవోలు కమిటీలో ఉంటారు. తుది నిర్ణయం మాత్రం కమిషనర్‌దే. అయితే బదిలీలకు సీనియార్టీతోపాటు ఆరోపణలను కూడా ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉండడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే అవినీతి, విజిలెన్స్ ఆరోపణలు, విధుల్లో సస్పెన్షన్ లాంటివి ఉన్న ఉద్యోగులు ఎక్కడ పోస్టింగ్ వస్తుందేమోనని మదనపడుతున్నారు.

### అనారోగ్య కారణాల సాకుతో..

బదిలీ ప్రక్రియ ఆఖరి దశకు చేరుకోవడంతో బదిలీని ఆపుకునేందుకు ఉద్యోగులు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అనారోగ్య కారణాలను చూపుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏండ్ల నుంచి పాతుకపోయిన ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫర్ చేయునున్నారు.

### 184 మందిలో 68 మందికి బదిలీ..

రాష్ట్రంలోని వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, కొండగట్టు, కొమురవెల్లి, బాసర ఆలయాలను కలిపి యూనిట్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేములవాడలో 63, యాదగిరిగుట్టలో 67, భద్రాచలంలో 13, కొండగట్టు 22, కొమురవెల్లి 10, బాసర 9 మంది ఉద్యోగులతో కలిపి ప్రస్తుతానికి 184 ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 40 శాతం.. 68 మంది ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాలున్నాయి.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571